10- 5- 26 rakshana_praja jyothi Medhak.qxd 8/20/2026 3:16 AM Page 1

మన రాజధాని
# రక్షణ
నిజం మా బలం
బాపట్ల | గుంటూరు | పల్నాడు
గురువారం 20 ఆగస్టు 2026 పేజీలు : 4

## సూర్యలంకలో స్వదేశీ దర్శన్ పనుల తనిఖీ

నాణ్యత విషయంలో రాజీపడొద్దు..

పర్యాటకులకు మెరుగైన వసతులు కల్పించాలి:

కలెక్టర్ వినోద్‌కుమార్....




సూర్యలంకలో స్వదేశీ దర్శన్ పనుల్లో నాణ్యత లోపాలకు తావులేదని కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ స్పష్టం చే శారు. గడువులోగా పనులు పూర్తి చేసి పర్యాటకులకు మెరుగైన వసతులు కల్పించాలని అధికారులను ఆదేశించారు.

బాపట్ల, రక్షణ బ్యూరో...

# ప్రశ్నిస్తే... చావగొడతారా!



- సీఎం వరకు వెళ్లిన ఫిర్యాదులు..
- కలెక్టర్, ఎస్పీ స్థాయిలో స్పందనలు కరువు
- ఇసుక అక్రమాలపై ప్రశ్నించిన జర్నలిస్టుపై దాడి నా?
- నాగార్జునరెడ్డికి న్యాయం కోసం జర్నలిస్టు సంఘాలు కదలాలి

తప్పు జరుగుతుందని కనిపిస్తే ప్రశ్నించడం తప్పా? ప్రజల సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లడం నేరమా? ప్రశ్నించినందుకు దాడి చేయడమే సమాధానమా? వేటపాలెం మండలం పందిళ్లపల్లి ఇసుక క్వారీల వద్ద జర్నలిస్టు నాయుడు నాగార్జునరెడ్డిపై జరిగినట్లు ఆరోపిస్తున్న దాడి ఇప్పుడు ఈ ప్రశ్నలను లేవనెత్తుతోంది. ఇసుక అక్రమ రవాణాపై విజిలెన్స్ విచారణ జరుగుతున్న సమయంలో అక్కడికి వెళ్లిన నాగార్జునరెడ్డిపై కొంతమంది దాడి చేసి తీవ్రంగా గాయపరిచినట్లు ఆయన కుటుంబ సభ్యులు ఆరోపించారు. ప్రస్తుతం ఆయన చీరాల ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నట్లు తెలిపారు. ఘటనకు సంబంధించిన పూర్తి వాస్తవాలు దర్యాప్తులో తేలాల్సి ఉంది.

2లో.

బాపట్ల జిల్లా రక్షణ క్రైమ్ స్పెషల్...

## గవర్నర్ పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు




చిలకలూరిపేట మండలం బొప్పూడి ఆంజనేయస్వామి ఆలయ అభివృద్ధి పనులకు ఈ నెల 27న గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ శంకుస్థాపన చేయనుండటంతో ఏర్పాట్లను కలెక్టర్ కృతికా శుక్లా పరిశీలించారు.

పల్నాడు రక్షణ న్యూస్



- 100 పట్టణ స్థానిక సంస్థలకు ఎన్నికల కసరత్తు
- ఇప్పటికే గడువు ముగిసినవి 87.. నవంబరులో ముగిసేవి 13
- బీసీలకు 33.33 శాతం రిజర్వేషన్లు

వివరాలు 2లో..

## మున్సిపల్ ఎన్నికలకు తెరలేచింది!

రాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికలకు ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. పదవీకాలం ముగిసిన 87, నవంబరులో గడువు ముగియనున్న 13 పట్టణ స్థానిక సంస్థలు కలిపి 100 యూఎల్‌బీల్లో ఎన్నికల నిర్వహణకు కసరత్తు ప్రారంభించాలని ఆదేశించింది. బీసీలకు 33.33 శాతం రిజర్వేషన్లు అమలు చేయడంతోపాటు ఓటర్ల జాబితాలు, వార్డులు, రిజర్వేషన్ల ప్రక్రియను ఎన్నికల సంఘంతో సమన్వయంతో పూర్తి చేయాలని స్పష్టం చేసింది.

అమరావతి రక్షణా బ్యూరో...

# గవర్నర్ పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు

మొదటి పేజీ తరువాయి

**పల్నాడు రక్షణ న్యూస్**

చిలకలూరిపేట: బొప్పూడి ఆంజనేయస్వామి దేవాలయ అభివృద్ధి పనులకు ఈ నెల 27న గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ శంకుస్థాపన చేయనున్నారు. ఈ నేపథ్యంలో జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా బుధవారం క్షేత్రస్థాయిలో పర్యటించి ఏర్పాట్లను పరిశీలించారు. గుంటూరు, పల్నాడు జిల్లాల ప్రధాన న్యాయమూర్తులు బి.సాయి కళ్యాణ్ చక్రవర్తి, నరేంద్రరెడ్డి, సంయుక్త కలెక్టర్ సంజనా సింహాలతో కలిసి ఆలయ కోనేరు, ఘాట్ రోడ్డు, మెట్ల మార్గం, కొండపై ప్రాంతాలను పరిశీలించారు. గవర్నర్ పర్యటన నేపథ్యంలో బందోబస్తు, బారికేడ్లు, ఇతర భద్రతా ఏర్పాట్లపై అధికారులకు పలు సూచనలు చేశారు. టీటీడీ మంజూరు చేసిన రూ.10 కోట్ల నిధులతో పుష్కరిణి అభివృద్ధి, ఘాట్ రోడ్డు, గరుడ వాహనం ఏర్పాటు తదితర పనులు చేపట్టనున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. కార్యక్రమంలో నరసరావుపేట ఆర్డీవో బాలకృష్ణ, డీఎస్పీ హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

# కోర్టు భవన స్థల పరిశీలన



**చిలకలూరుపేట, ఆగస్టు 19: రక్షణ న్యూస్:**

చిలకలూరుపేట మండలం పురుషోత్తపట్నంలో కోర్టు భవన నిర్మాణానికి ప్రతిపాదించిన స్థలాన్ని జాయింట్ కలెక్టర్ సంజన సింహ బుధవారం పరిశీలించారు. నీటిపారుదల శాఖ ఎస్ఈ, నరసరావుపేట ఆర్డీవో, మున్సిపల్ కమిషనర్, చిలకలూరుపేట తహసీల్దార్‌లతో కలిసి స్థలాన్ని పరిశీలించి వివరాలను తెలుసుకున్నారు. కోర్టు భవన నిర్మాణానికి అనువైన స్థలంగా గుర్తించిన ప్రాంతంలో అందుబాటులో ఉన్న వసతులు, భూమికి సంబంధించిన అంశాలపై అధికారులతో చర్చించారు.

# ప్రశ్నిస్తే... చావగొడతారా!

మొదటి పేజీ తరువాయి

**బాపట్ల జిల్లా రక్షణ క్రైమ్ స్పెషల్...**

నాగార్జునరెడ్డి గత కొంతకాలంగా బాపట్ల జిల్లాలో ఇసుక, మైనింగ్‌కు సంబంధించిన అక్రమాలపై ప్రశ్నిస్తూ వస్తున్నారని ఆయనకు మద్దతుగా ఉన్న జర్నలిస్టులు చెబుతున్నారు. అక్రమ ఇసుక రవాణాపై ఫిర్యాదులు చేయడంతో పాటు అధికారుల దృష్టికి సమస్యలను తీసుకెళ్లిన సందర్భాలు ఉన్నాయని తెలిపారు. ఈ ఫిర్యాదుల్లో కొన్ని రాష్ట్రస్థాయికి వెళ్లాయని, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్థాయిలో కూడా స్పందన వచ్చిన దాఖలాలు ఉన్నాయని వారు పేర్కొంటున్నారు. గతంలో జిల్లా కలెక్టర్, ఎస్పీ స్థాయిలో కూడా ఈ అంశాలపై ప్రశ్నలు, ఫిర్యాదులు వెళ్లినట్లు చెబుతున్నారు.ఒక వ్యక్తి తన కోసం ప్రశ్నిస్తే అది ఒక విషయం. కానీ ప్రజా సమస్యలపై ప్రశ్నించే జర్నలిస్టు విషయంలో పరిస్థితి వేరు. ఇసుక అక్రమ రవాణా జరుగుతోందని ఫిర్యాదు వస్తే అధికారులు దానిపై విచారణ చేయాలి. ఆరోపణల్లో నిజం లేకపోతే ప్రజలకు వాస్తవాలు చెప్పాలి. వార్త తప్పుగా ఉంటే ఖండించాలి. అవసరమైతే చట్టపరమైన మార్గాన్ని ఆశ్రయించాలి. కానీ ప్రశ్నించిన వ్యక్తిపై దాడి జరిగిందన్న ఆరోపణలు నిజమైతే అది ప్రజాస్వామ్య వ్యవస్థకే ప్రమాదకరమైన పరిణామం.నాగార్జునరెడ్డి గతంలోనూ ఇసుక, మైనింగ్ అంశాలపై పోరాడారని ఆయనకు మద్దతుగా ఉన్నవారు చెబుతున్నారు. అధికారంలో ఎవరు ఉన్నా ప్రశ్నించడమే తన విధానంగా కొనసాగించారని పేర్కొంటున్నారు. ఒత్తిళ్లు ఎదురైనా వెనక్కి తగ్గకుండా ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకువచ్చారని చెబుతున్నారు. మైనింగ్‌కు సంబంధించిన కొన్ని అంశాలపై న్యాయస్థానాలను కూడా ఆశ్రయించినట్లు తెలిపారు. అయితే ఈ వివరాలకు సంబంధించిన పూర్తి వాస్తవాలు అధికారిక రికార్డులు, దర్యాప్తు ద్వారా నిర్ధారించాల్సి ఉంటుంది.జర్నలిస్టుపై దాడి జరిగినప్పుడు అందరూ ఒక్కసారి ఆలోచించాల్సిన విషయం ఏమిటంటే.. నేడు నాగార్జునరెడ్డిని కొడితే, రేపు ప్రశ్నించే మరో జర్నలిస్టు పరిస్థితి ఏమిటి? ప్రశ్నించే ప్రతి వ్యక్తి భయపడే పరిస్థితి వస్తే అక్రమాలను ఎవరు వెలుగులోకి తీసుకురావాలి? అధికారులను ఎవరు ప్రశ్నించాలి? సామాన్యుడి సమస్యను ఎవరు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలి?అందుకే ఈ ఘటనను ఒక వ్యక్తిగత వివాదంగా వదిలేయకూడదని జర్నలిస్టు సంఘాలు, మీడియా వర్గాలు అంటున్నాయి. నాగార్జునరెడ్డిపై దాడి ఆరోపణలపై సమగ్ర, నిష్పక్షపాత విచారణ జరిపి వాస్తవాలను బయటకు తీసుకురావాలని డిమాండ్ చేయాల్సిన అవసరం ఉంది. దాడి చేసినవారు ఎవరైనా చట్టం ముందు నిలబెట్టాలని, జర్నలిస్టులకు రక్షణ కల్పించాలని ప్రభుత్వాన్ని కోరాల్సిన సమయం ఇది.

**ఇది నాగార్జునరెడ్డి ఒక్కడి సమస్య కాదు. ఇది ప్రతి జర్నలిస్టు సమస్య....**ఒక జర్నలిస్టు ప్రశ్నించినప్పుడు అతని వెనుక మొత్తం మీడియా సమాజం నిలబడాలి. ఒక విలేకరి మీద దాడి జరిగితే మిగిలిన జర్నలిస్టులు మౌనంగా ఉంటే, ఆ మౌనం రేపటి దాడులకు ధైర్యం ఇచ్చే ప్రమాదం ఉంది. అందుకే జర్నలిస్టు సంఘాలు రాజకీయాలకు అతీతంగా ఒక్కతాటిపైకి రావాలి. జిల్లాలోని ప్రతి జర్నలిస్టు ఈ ఘటనపై స్పందించాలి. నిజం రాసే జర్నలిస్టుకు అండగా నిలవాలి.జర్నలిస్టులపై దాడులు జరిగినప్పుడు కేవలం ఖండనలు సరిపోవు. అవసరమైతే పోలీసు అధికారులను కలిసి ఫిర్యాదు చేయాలి. కలెక్టర్, ఎస్పీని కలిసి జర్నలిస్టుల భద్రతపై స్పష్టమైన హామీ తీసుకోవాలి. ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలి. దాడికి బాధ్యులపై చర్యలు తీసుకునే వరకు ప్రజాస్వామ్య పద్ధతిలో పోరాటం చేయాలి. ఎందుకంటే ఈరోజు ఒక జర్నలిస్టు కోసం మాట్లాడటం అంటే రేపు మన వృత్తి భద్రత కోసం మాట్లాడటమే.నాగార్జునరెడ్డిపై దాడి వెనుక అసలు కారణం ఏమిటి? ఇసుక అక్రమ రవాణాపై ఆయన చేసిన ఫిర్యాదులకు, ఈ ఘటనకు సంబంధం ఉందా? విజిలెన్స్ విచారణ సమయంలోనే ఈ ఘటన ఎందుకు జరిగింది? గతంలో ఆయన చేసిన ఫిర్యాదులపై అధికారులు తీసుకున్న చర్యలు ఏమిటి? సీఎం స్థాయి నుంచి కలెక్టర్, ఎస్పీ స్థాయి వరకు స్పందించిన అంశాల ప్రస్తుత పరిస్థితి ఏమిటి? అన్నది దర్యాప్తులో తేలాలి.ప్రశ్నిస్తే జవాబు చెప్పాలి.. దాడి చేయకూడదు. వార్త నచ్చకపోతే ఖండించాలి.. జర్నలిస్టును కొట్టకూడదు. తప్పు ఉంటే చట్టాన్ని ఆశ్రయించాలి.. చట్టాన్ని చేతుల్లోకి తీసుకోకూడదు.

నేడు నాగార్జునరెడ్డిపై జరిగినట్లు చెబుతున్న ఘటనపై న్యాయం జరగడం ఒక జర్నలిస్టుకు మాత్రమే రక్షణ కాదు. రేపు నిజం రాయబోయే ప్రతి జర్నలిస్టుకు భరోసా. ప్రజా సమస్యపై ప్రశ్నించబోయే ప్రతి సామాన్యుడికి ధైర్యం.

జర్నలిస్టు సంఘాలు కదలాలి.

ప్రతి జర్నలిస్టు గొంతు కలపాలి.

దాడికి గురైన జర్నలిస్టుకు అండగా నిలవాలి.

నిజం రాసే కలాన్ని, గొంతికను కాపాడాలి....

# సూర్యలంకలో స్వదేశీ దర్శన్ పనుల తనిఖీ

మొదటి పేజీ తరువాయి

**బాపట్ల, రక్షణ బ్యూరో...**

సూర్యలంక పర్యాటక ప్రాంతాన్ని మరింత అభివృద్ధి చేసి పర్యాటకులకు మెరుగైన వసతులు, సౌకర్యాలు అందించే లక్ష్యంతో స్వదేశీ దర్శన్ పథకం కింద చేపడుతున్న అభివృద్ధి పనులను బాపట్ల జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ వి. బుధవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. బీచ్ ప్రాంతంలో జరుగుతున్న వివిధ నిర్మాణ పనుల పురోగతిని సంబంధిత అధికారులతో కలిసి పరిశీలించి, పనుల నాణ్యతపై ఆరా తీశారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ స్వదేశీ దర్శన్ పథకం కింద చేపడుతున్న ప్రతి నిర్మాణ పనిలోనూ నిర్దేశిత నాణ్యతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని అధికారులను, కాంట్రాక్టర్లను ఆదేశించారు. నిర్మాణ పనుల్లో నాణ్యత విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీపడరాదని స్పష్టం చేశారు. పనులను కేవలం గడువులోగా పూర్తి చేయడమే కాకుండా, దీర్ఘకాలం మన్నికగా ఉండేలా నాణ్యతతో చేపట్టాలని సూచించారు.

సూర్యలంకకు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో పర్యాటకులు వస్తున్న నేపథ్యంలో వారి అవసరాలకు అనుగుణంగా మౌలిక వసతులను అభివృద్ధి చేయాలని కలెక్టర్ సూచించారు. పర్యాటకులకు ఆహ్లాదకరమైన వాతావరణంతో పాటు అవసరమైన సౌకర్యాలు అందుబాటులో ఉండేలా నిర్మాణ పనుల ప్రణాళిక ఉండాలని తెలిపారు. నిర్ణీత గడువులోగా పనులను పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని కాంట్రాక్టర్లకు స్పష్టం చేశారు.పనుల పురోగతిని అధికారులు ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయిలో పర్యవేక్షించాలని కలెక్టర్ ఆదేశించారు. నిర్మాణ పనుల సమయంలో సాంకేతికపరమైన లేదా ఇతర సమస్యలు తలెత్తితే వాటిని ఆలస్యం చేయకుండా వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. పనుల నాణ్యత, పురోగతి, సమయపాలనపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు.సూర్యలంకను మరింత ఆకర్షణీయమైన పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయాలని కలెక్టర్ తెలిపారు. పర్యాటకుల సంఖ్య పెరిగేలా మౌలిక వసతులను మెరుగుపరచడంతో పాటు ఇప్పటికే ఉన్న సౌకర్యాలను కూడా పర్యవేక్షించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఆర్డీఓ ఏ. హరికుమార్, జిల్లా పర్యాటక శాఖ అధికారి బెన్హర్, తహశీల్దార్ షేక్ సలీమా, మండల సర్వేయర్ లక్ష్మీనారాయణ, టూరిజం ఏఈ శ్రీధర్ తదితర అధికారులు పాల్గొన్నారు.

10- 5- 26 rakshana_praja jyothi Medhak.qxd 8/20/2026 3:16 AM Page 3



# ప్రపంచ రాజకీయాలను ప్రభావితం చేస్తున్న జనరేషన్ జీ

## మాజీ ఎమ్మెల్సీ కె.ఎస్. లక్ష్మణరావు

**గుంటూరు: రక్షణ న్యూస్**

ప్రపంచవ్యాప్తంగా రాజకీయ పరిణామాలను ప్రభావితం చేసే శక్తి యువతకే ఉందని మాజీ ఎమ్మెల్సీ, జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షుడు కె.ఎస్. లక్ష్మణరావు అన్నారు. నేపాల్, బంగ్లాదేశ్ వంటి దేశాలతో పాటు ఇటీవల తమిళనాడులో ప్రభుత్వాల మార్పులోనూ 'జనరేషన్ జీ' కీలకపాత్ర పోషించిందని తెలిపారు.బ్రాడీపేటలోని బాలానంద కేంద్రంలో రాజ్యాంగ చర్చా వేదిక ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన 'జనరేషన్ జీ ఉద్యమంపై విశ్లేషణ' చర్చాగోష్ఠికి వేదిక అధ్యక్షుడు నడింపల్లి గురుజ్యోతి అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన లక్ష్మణరావు మాట్లాడుతూ 1997--2012 మధ్య జన్మించిన యువతను జనరేషన్ జీగా పిలుస్తారని వివరించారు. స్వేచ్ఛగా అభిప్రాయాలను వ్యక్తం చేయడం, తమ ఆలోచనలకు అనుగుణంగా వేగంగా ఫలితాలు సాధించేందుకు పోరాడటం వారి ప్రత్యేకతగా పేర్కొన్నారు.ఇటీవల ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద జరిగిన నిరసనల్లోనూ జనరేషన్ జీ యువత పెద్ద సంఖ్యలో పాల్గొందన్నారు. రాజకీయాలకు అతీతంగా విద్యా వ్యవస్థలో సమూల మార్పుల కోసం యువత ముందుకు రావడం అభినందనీయమన్నారు. రానున్న రోజుల్లో ప్రపంచ రాజకీయ ముఖచిత్రాన్ని మార్చగల సామర్థ్యం యువతకు ఉందని



పేర్కొన్నారు.జనచైతన్య వేదిక అధ్యక్షుడు రెడ్డి మాట్లాడుతూ సోషల్ మీడియా విస్తృతంగా అందుబాటులోకి రావడంతో స్మార్ట్‌ఫోన్‌ను యువత ఒక సాధనంగా ఉపయోగించుకుంటోందన్నారు. సామాజిక సమస్యలపై కోట్లాది మంది యువతను ఏకతాటిపైకి తీసుకురావడంలో సోషల్ మీడియా కీలకంగా మారిందని తెలిపారు.

విద్యపై దృష్టి పెట్టాలి..ప్రభుత్వ విద్యా వ్యవస్థను బలోపేతం చేయాలని కోరుతూ జనరేషన్ జీ కొత్త ఉద్యమానికి శ్రీకారం చుట్టడం అభినందనీయమన్నారు. సమాజంలోని ప్రధాన సమస్యలపై అందరినీ కలుపుకొని ఐక్యంగా ఉద్యమించాల్సిన అవసరం ఉందన్నారు. ఉద్యమాన్ని రాజకీయ పార్టీగా మార్చబోమని ప్రకటించడం మంచి పరిణా మమని పేర్కొన్నారు. కార్యక్రమ ంలో రాజ్యాంగ చర్చా వేదిక సంయుక్త కార్యదర్శి డాక్టర్ టి.సేవాకుమార్, అవగాహన వ్యవస్థాపకుడు కొండా శివరామిరెడ్డి, ఏపీ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు శ్రీనివాసరావు, వేదిక నేత పి.వెంకటేశ్వరరావు, సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ నేతలు పి.ఎస్.మూర్తి, వల్లూరి సదాశివరావు, ఎన్.భావనారాయణ, నందికాంత్, వి.వి.కె.సురేష్, జనచైతన్య వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.ధనుంజయరెడ్డి పాల్గొన్నారు.

# వట్టిచెరుకూరు చెరువు పనులు తనిఖీ చేసిన కలెక్టర్

### రూ.50 లక్షలతో అభివృద్ధి.. పిక్నిక్ స్పాట్‌గా తీర్చిదిద్దేలా పనులు



**గుంటూరు, రక్షణ న్యూస్..**

వట్టిచెరుకూరు ఊర చెరువు అభివృద్ధి పనులను జిల్లా కలెక్టర్ సి.ఎం. సాయికాంత్ వర్మ బుధవారం తనిఖీ చేశారు. 'ప్రతి ఒక్క రికీ నీరు' లక్ష్యంతో ప్రధానమంత్రి కృషి సంచయి యోజన కింద రూ.50 లక్షలతో చేపట్టిన పనుల పురోగతిని పరిశీలించారు.చెరువును ఆహ్లాదకరంగా, సుందరంగా తీర్చిదిద్దుతున్నట్లు కలెక్టర్ తెలిపారు. చిన్నారుల కోసం ఆట పరికరాలు, పెద్దలు సేదతీరేందుకు బెంచీలు, గట్టు చుట్టూ మొక్కలు, వాకింగ్ ట్రాక్, జిమ్ పరికరాలను ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. చెరువును చక్కటి పిక్నిక్ స్పాట్‌గా అభివృద్ధి చేయనున్నట్లు వివరించారు.

14, 7 ఎకరాల్లో అభివృద్ధి,,,ఊర చెరువు చుట్టుపక్కల దాదాపు 100 ఎకరాల్లో చిన్నచిన్న చెరువులు ఉన్నాయని అధికారులు తెలిపారు. ప్రధాన చెరువులో 14 ఎకరాల విస్తీర్ణంలోని ఒక భాగం, మరో 7 ఎకరాల భాగాన్ని అభివృద్ధి చేస్తున్నట్లు వివరించారు. అప్పాపురం ఛానల్ నుంచి గ్రావిటీ ద్వారా నిత్యం నీరు చెరువులోకి చేరడం అదనపు ప్రయోజనమని పేర్కొన్నారు.

ప్రతి నీటి బొట్టును ఒడిసిపట్టాలి...చెరువును పరిరక్షిస్తున్న విధానం, పూడికతీత పనుల వివరాలను గ్రామస్తులు కలెక్టర్‌కు వివరించారు. స్పందించిన కలెక్టర్ చెరువును సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రతి నీటి బొట్టును ఒడిసిపట్టాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని, ఆ దిశగా గ్రామస్తులు చర్యలు చేపట్టడం అభినందనీయమన్నారు.గ్రామంలో మౌలిక సదుపాయాల కల్పన, ఇళ్లు లేని వారికి పట్టాల పంపిణీపై దృష్టి సారించాలని గ్రామస్తులు కలెక్టర్‌ను కోరారు.కార్యక్రమంలో ఆర్డీవో కె. శ్రీనివాసరావు, జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ వి. శంకర్, జడ్పీ సీఈవో వి. జ్యోతి బసు, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ కె. కళ్యాణ చక్రవర్తి, డీపీవో బి.వి. నాగసాయి కుమార్, మండల తహసీల్దార్, ఎంపీడీవో, గ్రామస్థులు పాల్గొన్నారు.

# అంగన్‌వాడి పిల్లలందరికీ ఆధార్ తప్పనిసరి

### 5--7, 15--17 ఏళ్లలో బయోమెట్రిక్ అప్‌డేట్ ఉచితం
### పెండింగ్ ఆధార్ నమోదుకు నెల రోజుల్లో ప్రత్యేక చర్యలు
### ప్రతి నాలుగో శనివారం కలెక్టరేట్‌లో ఆధార్ క్యాంప్

**నరసరావుపేట, రక్షణ న్యూస్**

అంగన్‌వాడి కేంద్రాల్లోని పిల్లలందరికీ ఆధార్ ఉండేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కృతిక శుక్ల అధికారులను ఆదేశించారు. ఐదేళ్లలోపు పిల్లలకు పేరెంట్ బయోమెట్రిక్‌తో చేసిన ఆధార్‌ను ఐదేళ్ల తర్వాత తప్పనిసరిగా అప్‌డేట్ చేయించాలని సూచించారు. ఆధార్ లేని పిల్లలు అంగన్‌వాడుల్లో ఉండకూడదని స్పష్టం చేశారు.

పిల్లల జాబితా సిద్ధం చేయాలి...బుధవారం కలెక్టరేట్‌లోని వీసీ సమావేశ మందిరంలో జిల్లా స్థాయి ఆధార్ మానిటరింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రతి అంగన్‌వాడిలో ఎంతమంది పిల్లలు ఉన్నారో జాబితా సిద్ధం చేయాలని శిశు సంక్షేమ శాఖ పీడీని ఆదేశించారు. గ్రామాల్లోని అంగన్‌వాడి కేంద్రాల వారీగా పిల్లల వివరాలను సూపర్‌వైజర్ల ద్వారా సేకరించి, డీఎల్‌డీవోలతో సమన్వయం చేసుకుని ప్రత్యేక క్యాంపులు నిర్వహించాలని సూచించారు.

సంక్షేమ పథకాలకు ఆధార్ అవసరం...పాఠశాలల్లో అడ్మిషన్ల సమయంలో ఆధార్ నంబర్ అవసరమవుతుందని కలెక్టర్ తెలిపారు. భవిష్యత్తులో తల్లికి వందనం వంటి సంక్షేమ పథకాలకు కూడా ఆధార్ అవసరమవుతుందని పేర్కొన్నారు. నరసరావుపేట, పిడుగురాళ్ల, దాచేపల్లి, గురజాల, బొల్లాపల్లి మండలాల్లో ఆధార్



నమోదులు, అప్‌డేట్లు ఎక్కువగా పెండింగ్‌లో ఉన్నాయని.. నెల రోజుల్లో వాటిని పూర్తి చేయాలని ఆదేశించారు.

51,823 మంది ఆధార్ వివరాలు...జిల్లా విద్యాశాఖ అధికారి మాట్లాడుతూ యూడైస్ పరిధిలో 3,19,646 మంది పిల్లలు ఉన్నట్లు తెలిపారు. 0--15 ఏళ్లలోపు 28, 830 మంది, 15 ఏళ్లు పైబడిన 20,246 మంది పిల్లల ఆధార్ వివరాలు అప్‌లోడ్ చేసినట్లు వెల్లడించారు. మొత్తం 51,823 మంది ఆధార్ నమోదులు పూర్తయినట్లు తెలిపారు.

రెండు దశల్లో బయోమెట్రిక్...5--17 ఏళ్లలోపు పిల్లలకు ముందుగా బయోమెట్రిక్ అప్‌డేట్ చేయించాలని కలెక్టర్ డీఈవోను ఆదేశించారు. పిల్లలకు ఆధార్‌లో రెండు బయోమెట్రిక్ అప్‌డేట్లు ఉంటాయని అధికారులు తెలిపారు. 5--7, 15--17 సంవత్సరాల మధ్య ఉచితంగా బయోమెట్రిక్ అప్‌డేట్ చేసుకునే అవకాశం ఉందన్నారు.ప్రైవేటు పాఠశాలల్లో ఆధార్ అప్‌డేట్ పెండింగ్ ఎక్కువగా ఉందని, క్యాంపులు నిర్వహించేందుకు అనుమతులు త్వరగా లభించడం లేదని అధికారులు కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. ఆధార్ క్యాంపులు నిర్వహించాల్సిన ప్రాంతాలను గుర్తించి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. ప్రతి నాలుగో శనివారం కలెక్టరేట్‌లో ఆధార్ క్యాంపు నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

# చీరాలలో ఓటర్ల జాబితా సవరణ పరిశీలించిన కలెక్టర్



**చీరాల, రక్షణ న్యూస్**

చీరాల మండల పరిధిలోని ఎన్‌టీఆర్ నగర్‌లో 49వ పోలింగ్ కేంద్రంలో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణలో భాగంగా నిర్వహిస్తున్న హియరింగ్ కార్యక్రమాన్ని బాపట్ల జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ వి. బుధవారం పరిశీలించారు. కార్యక్రమంలో ఆర్డీఓ, ఈఆర్ఓ నరసింహారావు, ఏఈఆర్ఓ, తహశీల్దార్ గోపీకృష్ణ, ఎంపీడీఓ, మున్సిపల్ కమిషనర్ డి. జోషఫ్, బీఎల్ఓలు పాల్గొన్నారు.

# స్థానిక ఎన్నికల సన్నాహాలు పకడ్బందీగా చేపట్టాలి

### కలెక్టర్లకు రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా ఆదేశాలు

**ఆగస్టు 19: రక్షణ బ్యూరో:** స్థానిక సంస్థల ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించేందుకు సమగ్ర ముందస్తు ప్రణాళికతో ఏర్పాట్లు చేపట్టాలని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా కలెక్టర్లను ఆదేశించారు. బుధవారం విజయవాడ నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి ఎన్నికల సన్నాహాలు, ఓటర్ల జాబితాలు, పోలింగ్ కేంద్రాలు, సిబ్బంది, ఎన్నికల సామగ్రి, భద్రతా ఏర్పాట్లపై సమీక్షించారు.ఎన్నికల ప్రక్రియలో నిబంధనలను కచ్చితంగా పాటించాలని, అధికారులు నిష్పాక్షికంగా



వ్యవహరించాలని సూచించారు. సున్నిత, సమస్యాత్మక ప్రాంతాలను ముందుగానే గుర్తించి భద్రతా చర్యలు చేపట్టాలని, ప్రతి పోలింగ్ కేంద్రంలో కనీస సౌకర్యాలు అందుబాటులో ఉండేలా చూడాలని ఆదేశించారు. ఈఎంఎస్ ద్వారా ఎన్నికల ప్రక్రియను సమర్థవంతంగా పర్యవేక్షించాలని తెలిపారు.

జిల్లాలో ఏర్పాట్లు పూర్తి...జిల్లాలో గ్రామ పంచాయతీలు, వార్డులు, పట్టణ స్థానిక సంస్థల ఎన్నికలకు అవసరమైన ఏర్పాట్లను సమన్వయంతో చేపడుతున్నట్లు కలెక్టర్ కృతిక శుక్ల తెలిపారు. పోలింగ్ కేంద్రాలను క్షేత్రస్థాయిలో సిబ్బంది తనిఖీ చేసి, సౌకర్యాలు, లోపాలను గుర్తించి మ్యాపింగ్ చేస్తున్నట్లు వివరించారు. ఓటర్ల జాబితాల తనిఖీ ప్రక్రియ కూడా ప్రారంభమైందన్నారు.జిల్లాలో ఎస్పీ పోస్టు ఖాళీగా ఉందని, బ్యాలెట్ బాక్సుల నిర్వహణకు కొంతమేర సిబ్బంది కొరత ఉందని కలెక్టర్ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. సమావేశంలో డీఆర్ఓ, డీపీఓ సుధాకర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## గుంటూరులో దోమల నియంత్రణకు పటిష్ట చర్యలు




**గుంటూరు, రక్షణ న్యూస్**

ప్రపంచ దోమల దినోత్సవం సం దర్భంగా నగ రం లో మలే రియా, డెంగ్యూ, చికున్ గున్యా నివారణకు పటిష్ట చర్యలు చేపడుతున్నట్లు నగర కమిషనర్ కె.మయూర్ అశోక్ తెలిపారు. 4 మలేరియా డివిజన్లలో 203 మంది సిబ్బందితో యాంటీ లార్వా కార్యక్రమాలు నిర్వహిస్తున్నా మన్నారు.గతేడాది ఇప్పటివరకు మలేరియా 4, డెంగ్యూ 51, చికున్‌గున్యా 8 కేసులు నమోదవగా, ఈ ఏడాది మలేరియా కేసులు శూన్యానికి, డెంగ్యూ 26, చికున్‌గున్యా ఒక కేసుకు తగ్గాయని తెలిపారు. నీటి నిల్వలను తొలగించడం, యాంటీ లార్వా చర్యలు, అవసరమైన చోట్ల ఫాగింగ్, డ్రోన్ స్ప్రేయింగ్ చేపడుతున్నామన్నారు. సుమారు 15 లక్షల గంబూసియా చేపలను నీటి వనరుల్లో వదిలి జీవ నియంత్రణ చర్యలు చేపట్టామని పేర్కొన్నారు.దోమల నియంత్రణలో ప్రజల భాగస్వామ్యం కీలకమని, ప్రతి శుక్రవారం డ్రైడే పాటించి ఇళ్లలో, పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూడాలని కమిషనర్ సూచించారు.

# పేకాట క్లబ్‌ను వెంటనే మూసివేయాలి

## డీఎస్పీకి వినతిపత్రం అందజేసిన వైకాపా సమన్వయకర్త డాక్టర్ గజ్జల

**సత్తెనపల్లి,రక్షణ న్యూస్:**

సత్తెనపల్లి పట్టణంలో అధికార రాజకీయ అండతో పేకాట క్లబ్ నిర్వహిస్తున్నారని ఆరోపిస్తూ వైకాపా సత్తెనపల్లి నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ గజ్జల సుధీర్ భార్గవ రెడ్డి బుధవారం డీఎస్పీకి వినతిపత్రం అందజేశారు. పేకాట క్లబ్‌ను వెంటనే మూసివేసి, నిర్వాహకులపై తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.వైకాపా కార్యాలయం నుంచి డీఎస్పీ కార్యాలయం వరకు పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ర్యాలీగా వెళ్లిన గజ్జల.. అనంతరం డీఎస్పీకి వినతిపత్రం సమర్పించారు. గతంలో పోలీసులు పేకాట క్లబ్‌పై దాడి చేసి కొంత నగదు, వాహనాలను స్వాధీనం చేసుకున్నప్పటికీ.. రాజకీయ అండతో తిరిగి క్లబ్ నిర్వహిస్తున్నారని ఆరోపించారు.వివిధ ప్రాంతాల నుంచి పేకాట ఆడేందుకు పలువురు సత్తెనపల్లికి వస్తున్నారని, పేకాట కారణంగా అనేక కుటుంబాలు ఆర్థికంగా, సామాజికంగా నష్టపోతున్నాయని గజ్జల పేర్కొన్నారు. పట్టణ ప్రజల ఆందోళనను



దృష్టిలో ఉంచుకుని క్లబ్‌ను తక్షణమే మూసివేయాలని, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో చిలకలూరిపేట నియోజకవర్గ పరిశీలకులు చిట్టా విజయభాస్కర్‌రెడ్డి, రాష్ట్ర అధికార ప్రతినిధి యనమల నాగార్జున యాదవ్‌తో పాటు పార్టీ రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ, పట్టణ, మండల, గ్రామ, వార్డు, అనుబంధ విభాగాల బాధ్యులు, ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

## జీఎస్టీ వసూళ్లపై కలెక్టర్ సమీక్ష

### ప్రొఫెషనల్ ట్యాక్స్ పరిధిలోకి ప్రైవేటు సంస్థలు, ఆసుపత్రుల సిబ్బంది

### చెక్‌పోస్టుల్లో సిబ్బందిని రొటేషన్ పద్ధతిలో నియమించాలని ఆదేశం

**నరసరావుపేట, ఆగస్టు 19: రక్షణ న్యూస్:**

పల్నాడు జిల్లాలో జీఎస్టీ అమలు, పన్నుల వసూళ్లపై జిల్లా కలెక్టర్ బుధవారం సమీక్ష నిర్వహించారు. జిల్లాలో జీఎస్టీ వసూళ్ల పురోగతి, వాహన తనిఖీలు, ప్రొఫెషనల్ ట్యాక్స్ వసూళ్లకు అవసరమైన వివరాలపై అధికారులతో చర్చించారు.కలెక్టర్ కార్యాలయంలోని బీసీ సమావేశ మందిరం నుంచి జీఎస్టీ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లాలో జీఎస్టీ అమలు తీరు, వసూళ్ల వివరాలను కమర్షియల్ ట్యాక్స్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. నరసరావుపేట, పిడుగురాళ్ల, సత్తెనపల్లి మూడు సర్కిళ్లలో సత్తెనపల్లి సర్కిల్‌లో జీఎస్టీ వసూళ్లు అధికంగా ఉన్నట్లు అధికారులు తెలిపారు.2026--27 ఆర్థిక సంవత్సరానికి రూ.14,786.57 లక్షల లక్ష్యానికి గాను జూలై వరకు రూ.8,510.89 లక్షలు వసూలైనట్లు వెల్లడించారు. 2025--26లో ఇదే కాలానికి రూ.9,172.21 లక్షలు వసూలు కాగా, ప్రస్తుతం -7.22 శాతం వృద్ధి నమోదైనట్లు తెలిపారు. వాహన తనిఖీల ద్వారా జూలై 2026 వరకు రూ.40.09 లక్షల ఆదాయం సమకూరినట్లు అధికారులు వివరించారు.

ప్రొఫెషనల్ ట్యాక్స్‌పై దృష్టి...ప్రైవేటు ఆసుపత్రుల్లో పనిచేస్తున్న సిబ్బంది, ప్రైవేటు సంస్థల్లో ఉద్యోగుల వివరాలను సేకరించి ప్రొఫెషనల్ ట్యాక్స్ వసూళ్లకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్



సూచించారు. రామాపురం, తంగెడ, వి.పీ. సౌత్ కమర్షియల్ ట్యాక్స్ చెక్‌పోస్టుల వద్ద రొటేషన్ పద్ధతిలో సిబ్బందిని నియమించేలా ఉత్తర్వులు ఇవ్వాలనికోరారు. కాంట్రాక్టర్లు ఆంధ్రప్రదేశ్ పరిధిలోనే ప్లాంట్ అఫ్ ల్యాండ్ కొనుగోలు చేస్తున్నారా లేదా అన్నది అన్ని ఇ ంజినీరింగ్ విభాగాలు పరిశీలించాలని జీఎస్టీ అధికారులు సూచిం చారు. జిల్లాలో కేటాయించిన మొత్తం పనుల వివరాలు, కొత్త పరి శ్రమలజాబితాను జిల్లా పరిశ్రమల కేంద్రం నుంచి అందించాలని కోరారు.

జీఎస్టీ టీడీఎస్ చెల్లింపుపై ఆదేశాలు...పంచాయతీరాజ్ శాఖ ద్వారా చెల్లించాల్సిన జీఎస్టీ టీడీఎస్‌ను సకాలంలో జమ చేసేలా అన్ని ఎంపీడీవోలకు ఆదేశాలు ఇవ్వాలని కోరారు. జీఎస్టీ టీడీఎస్ జమ చేయకపోవడం, జీఎస్టీఆర్--7 దాఖలు చేయకపోవడంపై డీపీవో, ఎంపీడీవోలకు తగిన సూచనలు చేయాలని తెలిపారు.జిల్లాలోని అన్ని బ్యాంకుల ప్రాథమిక సమాచారం, బకాయిల వివరాల సేకరణకు సహకరించాలని అధికారులు కోరారు. వాణిజ్య పన్నుల శాఖ ఉద్యోగుల జాతీయ గుర్తింపు కార్డులు, ఈ-మెయిల్ ఐడీలు, ఈ-ఆఫీస్ ఆధారాలు, మ్యాపింగ్ వివరాలను అందించాలని సూచించారు.ప్రొఫెషనల్ ట్యాక్స్ వసూళ్లకు సంబంధించి ఆర్డీవోల నుంచి తాకట్టు దళారుల జాబితా, లీడ్ బ్యాంకు మేనేజర్ నుంచి ఏటీఎంలు, బ్యాంకుల వివరాలు సేకరించాలని అధికారులు కోరారు.


# స్థానిక ఎన్నికలకు సన్నద్ధం కండి

### ఎలక్టోరల్ రోల్ ప్రక్రియ పకడ్బందీగా చేపట్టాలి

### సున్నిత, అతి సున్నిత పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి

**బాపట్ల, ఆగస్టు 19: రక్షణ న్యూస్:**

స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి ఎలక్టోరల్ రోల్ ప్రక్రియను ప్రణాళికాబద్ధంగా, పకడ్బందీగా నిర్వహించాలని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునీత్ అధికారులను ఆదేశించారు. ఎన్నికల నిర్వహణకు అవసరమైన ముందస్తు ఏర్పాట్లను పూర్తి చేసి, ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా చర్యలు చేపట్టాలని సూచించారు.బుధవారం రాష్ట్ర సచివాలయం నుంచి అన్ని జిల్లాల ఎన్నికల అధికారులతో స్థానిక సంస్థల ఎన్నికల ముందస్తు చర్యలపై రాష్ట్ర ఎన్నికల కమిషనర్ వీక్షణ సమావేశం నిర్వహించారు. పంచాయతీ, జిల్లా పరిషత్, మండల పరిషత్, స్థానిక సంస్థల ఎన్నికలకు ముందు చేపట్టాల్సిన కార్యక్రమాలు, ఎన్నికల ప్రక్రియపై అధికారులకు వివరించారు.



పోలింగ్ కేంద్రాలపై దృష్టి...ఎన్నికల నిర్వహణకు అవసరమైన పోలింగ్ కేంద్రాలను ముందుగానే సిద్ధం చేయాలని అనిల్ చంద్ర పునీత్ సూచించారు. బ్యాలెట్ బాక్సుల ప్రస్తుత పరిస్థితిపై నివేదిక సమర్పించాలని ఆదేశించారు. సున్నిత, అతి సున్నిత పోలింగ్ కేంద్రాలను గుర్తించి, వాటి వద్ద భద్రతా ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు.స్థానికంగా సమకూర్చుకోవాల్సిన ఎన్నికల సామగ్రి, రాష్ట్ర స్థాయి నుంచి అందాల్సిన సామగ్రిపై అధికారులకు స్పష్టమైన అవగాహన ఉండాలని తెలిపారు. ఎన్నికల నిర్వహణకు అవసరమైన సిబ్బందిని ముందుగానే సమకూర్చుకోవాలని సూచించారు. ఎన్నికల ప్రక్రియపై అధికారులకు శిక్షణ తరగతులు నిర్వహిస్తామని చెప్పారు.

బ్యాలెట్ బాక్సులు సిద్ధం...జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ వి మాట్లాడుతూ జిల్లాలో ఎన్నికల నిర్వహణకు అవసరమైన బ్యాలెట్ బాక్సులు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. చీరాల, వేటపాలెం ప్రాంతాలకు సంబంధించిన కోర్టు కేసులు పూర్తయ్యాయని, బాపట్లకు సంబంధించి తీర్పు వెలువడాల్సి ఉందని వివరించారు. ఎన్నికల నిర్వహణపై ఎంపీడీవోలకు శిక్షణ ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు.ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా అన్ని ముందస్తు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. సమావేశంలో ఇన్‌చార్జి జిల్లా రెవెన్యూ అధికారి లవన్న, పంచాయతీ అధికారి కే. ప్రభాకర్, బాపట్ల, చీరాల, రేపల్లె మున్సిపల్ కమిషనర్లు హాసిని, డానియల్ జోసెఫ్, సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

# ఆపదలో ఉన్న కుటుంబాలకు సీఎంఆర్ఎఫ్ అండ



**వేమూరు రక్షణ న్యూస్**

ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా వేమూరు నియోజకవర్గానికి చెందిన ఆరుగురు లబ్ధిదారులకు రూ. 6,99,893 విలువైన వైద్య సహాయం మంజూరైంది. వివిధ అనారోగ్య సమస్యలతో ప్రైవేటు ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న వారి వైద్య ఖర్చులకు సంబంధించిన బిల్లులను వేమూరు ఎమ్మెల్యే, మాజీ మంత్రి నక్కా ఆనందబాబు ప్రత్యేక సిఫార్సుతో జవీ=ఖీ కార్యాలయానికి పంపించారు. పరిశీలించిన ప్రభుత్వం లెటర్ ఆఫ్ క్రెడిట్ (గాజ) రూపంలో ఆర్థిక సహాయాన్ని మంజూరు చేసింది. భట్టిప్రోలు మండలం ఐలవరం గ్రామానికి చెందిన కందుల సుజాతకు రూ. 2,51,146, వెల్లటూరు గ్రామానికి చెందిన బొమ్మిడి వెంకటకుమారికి రూ. 1,00,551, పెదలంక గ్రామానికి చెందిన కలం రత్నబాబుకు రూ. 1, 06,542, కొల్లూరు మండలం చిలుమూరు గ్రామానికి చెందిన కోట కుమారికి రూ. 59,492, పొత్తర్లంక గ్రామానికి చెందిన రాఘుల శేషుబాబుకు రూ. 1,32,670, వేమూరు మండలం జంపని గ్రామానికి చెందిన పాపబత్తిని రమాదేవికి రూ. 49,492 చొప్పున సాయం మంజూరైంది. మంజూరైన గాజ పత్రాలను ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో, ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ సారథ్యంలో కూటమి ప్రభుత్వం ప్రజల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యం ఇస్తోందన్నారు. అత్యవసర వైద్య చికిత్స అవసరమైన పేద, మధ్యతరగతి కుటుంబాలకు జవీ=ఖీ ఎంతో భరోసాగా నిలుస్తోందని తెలిపారు. వేమూరు నియోజకవర్గంలోని అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా నిరంతరం కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. వైద్య సహాయం మంజూరు చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌లకు, ప్రత్యేక చొరవ తీసుకున్న ఎమ్మెల్యే నక్కా ఆనందబాబుకు లబ్ధిదారులు కృతజ్ఞతలు తెలిపారు.

# 34 శాతం రిజర్వేషన్లపై బీసీల హర్షం




**ప్రత్తిపాడు రక్షణ న్యూస్**

స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం చారిత్రాత్మకమని ప్రత్తిపాడు ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు అన్నారు. ప్రభుత్వ నిర్ణయాన్ని స్వాగతిస్తూ ప్రత్తిపాడు నియోజకవర్గ క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ చిత్రపటాలకు పాలాభిషేకం నిర్వహించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పించడం సామాజిక న్యాయం, రాజకీయ సాధికారత దిశగా కీలక ముందడుగన్నారు. గ్రామీణ స్థానిక సంస్థల్లో 34 శాతం, మున్సిపాలిటీల్లో 33.33 శాతం రిజర్వేషన్ల అమలుతో ప్రజాస్వామ్య పాలనలో బీసీల భాగస్వామ్యం మరింత పెరుగుతుందని పేర్కొన్నారు. తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుంచే బీసీల సంక్షేమం, రాజకీయ ప్రాతినిధ్యానికి ప్రాధాన్యం ఇస్తోందని తెలిపారు. స్వర్గీయ ఎన్టీఆర్ హయాంలో బీసీలకు రాజకీయంగా సముచిత స్థానం కల్పించారని, అదే స్ఫూర్తితో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు బీసీల అభ్యున్నతికి అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేస్తున్నారని అన్నారు. కుల, చేతివృత్తులకు ప్రోత్సాహం, విద్య, నైపుణ్యాభివృద్ధి, ఉపాధి, వ్యాపార అవకాశాలతో పాటు బీసీ యువత ఆర్థికంగా ఎదిగేందుకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోందన్నారు. 34 శాతం రిజర్వేషన్లు కేవలం ఎన్నికల హామీ కాదని, బీసీలకు రాజకీయ సాధికారత కల్పించాలనే కూటమి ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనమని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. బీసీలకు న్యాయం, అవకాశం, అధికారం కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోం దన్నారు. కార్యక్రమంలో బీసీ ముఖ్య నాయకులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# రెంటాల గ్రామంలో పోలీస్ పహారా



**రెంటచింతల రక్షణ న్యూస్**

రెంటచింతల మండ లంలోని రెంటాల గ్రామంలో కారంపూడి సీఐ ఆవుల భాస్కర్, ఎస్ఐ సీహెచ్ నాగార్జు న బుధవారం పర్యటించి శాంతిభద్రతలను సమీక్షించారు. గత కొద్ది రోజులుగా గ్రామంలో ఏర్పాటు చేసిన పోలీసు పికెట్‌ను పరిశీలించి, విధుల్లో ఉన్న సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ నెల 6న వైసీపీ యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శి నవులూరి చెన్నారెడ్డి హత్యకు గురైన నేపథ్యంలో ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా రెంటాలలో పోలీసు పికెట్‌ను ఏర్పాటు చేశారు. చెన్నారెడ్డి సంతాప సభకు వైసీపీకి చెందిన ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు బుధవారం హాజరుకానున్న నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు భద్రతా చర్యలు చేపట్టారు.

# పార్టీ బలోపేతానికి కృషి చేస్తా



**యద్దనపూడి రక్షణ న్యూస్**

తెలుగుదేశం పార్టీ నూతన మండల అధ్యక్షుడిగా నియమితులైన తారక రామారావు కుటుంబ సభ్యులతో కలిసి ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తనకు మండల పార్టీ అధ్యక్ష పదవి అప్పగించినందుకు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావుకు తారక రామారావు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ మండలంలో పార్టీని మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తానని తారక రామారావు తెలిపారు. పార్టీ నాయకులు, కార్యకర్తలను సమన్వయం చేసుకుంటూ గ్రామస్థాయి నుంచి పార్టీని మరింత పటిష్ఠం చేసేందుకు తన వంతు కృషి చేస్తానన్నారు. ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు పార్టీ కార్యక్రమాలను విజయవంతం చేసేందుకు శ్రమిస్తానని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు మాట్లాడుతూ పార్టీకి అంకితభావంతో పనిచేసే నాయకులకు సముచిత ప్రాధాన్యం కల్పిస్తామని తెలిపారు. నూతన మండల అధ్యక్షుడిగా తారక రామారావు పార్టీని సమర్థవంతంగా ముందుకు తీసుకెళ్తారన్న నమ్మకం ఉందన్నారు. నాయకులు, కార్యకర్తలందరినీ కలుపుకొని సమన్వయంతో పనిచేస్తూ యద్దనపూడి మండలంలో తెలుగుదేశం పార్టీని మరింత బలోపేతం చేయాలని సూచించారు. కార్యక్రమంలో తారక రామారావు కుటుంబ సభ్యులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

10- 5- 26 rakshana_praja jyothi Medhak.qxd 8/20/2026 3:16 AM Page 6



# మున్సిపల్ ఎన్నికలకు తెరలేచింది!

మొదటి పేజీ తరువాయి

**అమరావతి రక్షణా బ్యూరో...**

ఓటర్ల జాబితాలు, వార్డులు, రిజర్వేషన్లపై కసరత్తు ఎన్నికల సంఘంతో సమన్వయంతో ముందుకు వెళ్లాలని ప్రభుత్వం ఆదేశాలుఅమరావతి, ఆగస్టు 19: ఆంధ్రప్రదేశ్‌లో పట్టణ స్థానిక సంస్థల ఎన్నికలకు రంగం సిద్ధమవుతోంది. మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు అవసరమైన ముందస్తు చర్యలు చేపట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా అనుమతి ఇచ్చింది. ఇప్పటికే పదవీకాలం ముగిసిన మున్సిపాలిటీలు, నగరపాలక సంస్థలతో పాటు నవంబరులో పదవీకాలం ముగియనున్న పట్టణ స్థానిక సంస్థలను ఎన్నికల ప్రక్రియలోకి తీసుకురావాలని మున్సిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖ బుధవారం జీఓఆర్టీ నంబర్ 1065 జారీ చేసింది.రాష్ట్రంలో మొత్తం 123 పట్టణ స్థానిక సంస్థలు (యూఎల్‌బీలు) ఉండగా.. వాటిలో 87 సంస్థల పాలకవర్గాల పదవీకాలం ఇప్పటికే ముగిసింది. మరో 13 సంస్థల పాలకవర్గాల గడువు నవంబరు 2026లో ముగియనుంది. ఈ రెండు కేటగిరీల్లోని మొత్తం 100 యూఎల్‌బీలకు ఎన్నికలు నిర్వహించేందుకు ప్రభుత్వం చర్యలకు అనుమతి ఇచ్చింది. మరో 23 సంస్థల్లో గతంలో ఎన్నికలు నిర్వహించలేకపోయినందున వాటిని ప్రస్తుత ప్రక్రియలో చేర్చలేదు. ఆయా సంస్థలకు సంబంధించి కోర్టు కేసులు, ఇతర న్యాయపరమైన అంశాలు పెండింగ్‌లో ఉన్నట్లు ప్రభుత్వం పేర్కొంది.

ఇక ఎన్నికల పనులు వేగం..ఎన్నికలకు ముందుగా చేయాల్సిన పనులన్నింటినీ కాలపరిమితిలో పూర్తి చేయాలని ప్రభుత్వం స్పష్టం చేసింది. రాష్ట్ర ఎన్నికల సంఘంతో సమన్వయం చేసుకుంటూ ఓటర్ల జాబితాల తయారీ, వార్డులకు సంబంధించిన ప్రక్రియ, రిజర్వేషన్ల ప్రకటన, ఇతర చట్టపరమైన ప్రక్రియలను పూర్తి చేయాలని ఆదేశించింది.

రాష్ట్ర ఎన్నికల సంఘం ఇప్పటికే పట్టణ స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించిన ముందస్తు ఏర్పాట్లపై చర్యలు ప్రారంభించింది. ఇటీవల జారీ చేసిన మార్గదర్శకాల నేపథ్యంలో ప్రభుత్వ శాఖలు తమ పరిధిలోని ప్రక్రియలను పూర్తి చేయాల్సి ఉంటుంది.

బీసీలకు 33.33 శాతం...మున్సిపల్ ఎన్నికల్లో బీసీల రాజకీయ ప్రాతినిధ్యంపై ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. పట్టణ స్థానిక సంస్థల్లో 33.33 శాతం బీసీ రిజర్వేషన్లు అమలు చేయాలని జీఓలో స్పష్టం చేసింది. ఏపీ మున్సిపల్ కార్పొరేషన్స్ చట్టం--1994, ఏపీ మున్సిపాలిటీస్ చట్టం--1965లోని సంబంధిత నిబంధనల మేరకు ఈ రిజర్వేషన్లను అమలు చేయనున్నారు.గ్రామీణ స్థానిక సంస్థల్లో బీసీలకు 34 శాతం, పట్టణ స్థానిక సంస్థల్లో 33.33 శాతం రిజర్వేషన్లు కల్పించాలన్న ప్రభుత్వ నిర్ణయం తాజాగా వెలువడింది. ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లలో మార్పు ఉండదని ప్రభుత్వం స్పష్టం చేసింది.

రిజర్వేషన్లపై ఉత్కంఠ...బీసీ రిజర్వేషన్ల అమలుతో మున్సిపల్ ఎన్నికల రాజకీయ సమీకరణాలు మారే అవకాశం ఉంది. ఏ వార్డు ఏ వర్గానికి కేటాయిస్తారు? మహిళలకు ఎన్ని వార్డులు వస్తాయి? చైర్మన్, మేయర్ పదవులు ఏ వర్గానికి దక్కుతాయి? అనే అంశాలపై రాజకీయ పార్టీల్లో చర్చ మొదలుకానుంది.వార్డుల వారీగా ఓటర్ల వివరాలు, సామాజిక వర్గాల గణాంకాలు, గతంలో అమలైన రిజర్వేషన్లను పరిగణనలోకి తీసుకుని రిజర్వేషన్ల రోస్టర్ ఖరారు చేయాల్సి ఉంటుంది. రిజర్వేషన్ల ప్రకటన తర్వాతే ఆయా ప్రాంతాల్లో పోటీ చేయాలనుకునే ఆశావహులపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

87 చోట్ల పాలకవర్గాలు లేవు...రాష్ట్రంలోని 87 పట్టణ స్థానిక సంస్థల పాలకవర్గాల పదవీకాలం ఇప్పటికే ముగిసింది. దీంతో ఆయా ప్రాంతాల్లో ఎన్నికల నిర్వహణపై కొంతకాలంగా ఎదురుచూపులు కొనసాగుతున్నాయి. మరో 13 సంస్థల పదవీకాలం నవంబరులో ముగియనుండటంతో వాటినీ ప్రస్తుత ఎన్నికల ప్రక్రియలోకి తీసుకోవాలని ప్రభుత్వం నిర్ణయించింది.రాజ్యాంగంలోని 243-యూ ప్రకారం మున్సిపాలిటీ, మున్సిపల్ కార్పొరేషన్ వంటి స్థానిక సంస్థల పాలకవర్గాల పదవీకాలం ఐదేళ్లు. గడువు ముగిసేలోపు కొత్త పాలకవర్గాన్ని ఏర్పాటు చేసేందుకు ఎన్నికలు నిర్వహించాల్సి ఉంటుంది. ఎన్నికల నిర్వహణపై పర్యవేక్షణ, దిశానిర్దేశం రాష్ట్ర ఎన్నికల సంఘం పరిధిలో ఉంటుంది.

23 సంస్థలకు మాత్రం బ్రేక్...మొత్తం 123 యూఎల్‌బీల్లో 23 సంస్థలకు మాత్రం ప్రస్తుతం ఎన్నికల ప్రక్రియ వర్తించదు. గతంలో ఎన్నికలు నిర్వహించలేకపోవడానికి కోర్టు కేసులు, ఇతర సంబంధిత అంశాలు కారణమని ప్రభుత్వం పేర్కొంది. ఆయా కేసులు, సమస్యల పరిష్కారం తర్వాత వాటి ఎన్నికలపై తదుపరి నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది.దీంతో ప్రస్తుత దశలో ప్రధానంగా 100 పట్టణ స్థానిక సంస్థలపైనే ఎన్నికల యంత్రాంగం దృష్టి పెట్టనుంది.

రాజకీయ పార్టీల్లో కదలిక...ప్రభుత్వం ఎన్నికల ఏర్పాట్లకు అనుమతి ఇవ్వడంతో మున్సిపల్ రాజకీయాల్లో కదలిక మొదలుకానుంది. వార్డు స్థాయిలో బలాబలాలు, గత ఎన్నికల్లో వచ్చిన ఫలితాలు, స్థానిక నేతల ప్రభావం, రిజర్వేషన్ల మార్పులు వంటి అంశాలపై ప్రధాన రాజకీయ పార్టీలు లెక్కలు వేసే అవకాశం ఉంది.మున్సిపల్ ఎన్నికల్లో అభ్యర్థుల ఎంపిక పార్టీలు ఎదుర్కొనే కీలక అంశంగా మారనుంది. రిజర్వేషన్లు ఖరారైన తర్వాత ఆశావహులు తమకు అనుకూలమైన వార్డుల కోసం ప్రయత్నాలు ముమ్మరం చేయనున్నారు.

ఓటర్ల జాబితాపైనే మొదటి దృష్టి...ఎన్నికల ప్రక్రియలో మొదటి కీలక అడుగు ఓటర్ల జాబితాలే. పట్టణ ప్రాంతాల్లో ఓటర్ల వివరాలను పరిశీలించి వార్డుల వారీగా జాబితాలను సిద్ధం చేయాల్సి ఉంటుంది. పేర్ల తొలగింపు, చేర్పులు, చిరునామాల మార్పులు, డూప్లికేట్ ఓట్లు తదితర అంశాలపై అభ్యంతరాలను స్వీకరించి తుది జాబితాలను సిద్ధం చేయనున్నారు.మున్సిపల్ కార్పొరేషన్లకు సంబంధించి ఓటర్ల జాబితా ప్రక్రియపై రాష్ట్ర ఎన్నికల సంఘం ఇప్పటికే సన్నాహాలు ప్రారంభించినట్లు తాజా సమాచారం వెల్లడిస్తోంది. సెప్టెంబరు 3న తుది ఫొటో ఓటర్ల జాబితాల ప్రచురణకు సంబంధించి ప్రక్రియ కొనసాగుతున్నట్లు వార్తలు వచ్చాయి.

ఎప్పుడెప్పుడు?...ప్రభుత్వం తాజాగా ఇచ్చిన అనుమతితో ఎన్నికల ప్రక్రియకు అవసరమైన పరిపాలనా కసరత్తు వేగం పుంజుకోనుంది. అయితే ఎన్నికల పూర్తి షెడ్యూల్, నామినేషన్లు, పోలింగ్, ఓట్ల లెక్కింపు వంటి తేదీలను రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రకటించాల్సి ఉంటుంది.

ప్రస్తుతం ప్రభుత్వం చేయాల్సిన పనులు పూర్తి చేసి ఎన్నికల సంఘానికి సహకరించాల్సి ఉంది. అందులో భాగంగా మున్సిపల్ పరిపాలన శాఖ, కమిషనర్ అండ్ డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, జిల్లా కలెక్టర్లు, మున్సిపల్ కమిషనర్లు సమన్వయంతో పనిచేయాలని జీఓలో స్పష్టం చేశారు.

స్థానిక సమరానికి సన్నాహాలు...మొత్తంగా చూస్తే.. మున్సిపల్ ఎన్నికలకు ప్రభుత్వం అధికారికంగా గ్రీన్‌సిగ్నల్ ఇచ్చినట్లే. 100 పట్టణ స్థానిక సంస్థల్లో ఎన్నికల నిర్వహణకు అవసరమైన ప్రక్రియను ముందుకు తీసుకెళ్లేందుకు మార్గం సుగమమైంది. బీసీలకు 33.33 శాతం రిజర్వేషన్ల అమలుతో సామాజిక సమీకరణాలకు ప్రాధాన్యం పెరగనుంది. ఓటర్ల జాబితాలు, వార్డుల ప్రక్రియ, రిజర్వేషన్ల ఖరారు పూర్తయిన తర్వాత ఎన్నికల వాతావరణం మరింత వేడెక్కనుంది.

మరి.. మున్సిపల్ సమరం ఎప్పుడు?

ప్రభుత్వ కసరత్తు పూర్తయి.. రాష్ట్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ ప్రకటించడమే ఇక మిగిలింది.

# ఫోటోగ్రఫీ దినోత్సవంలో సేవాభావం

**బాపట్ల రక్షణ న్యూస్**

ప్రగతి బాపట్ల ఫోటోగ్రాఫర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అసోసియేషన్ అధ్యక్షుడు మత్సా సుధాకర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఫోటోగ్రఫీ పితామహుడు జాక్వస్ లూయిస్ డాగెర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా సుధాకర్ మాట్లాడుతూ ఫోటోగ్రఫీకి సమాజంలో ఎంతో ప్రాధాన్యత ఉందని, ఫోటోగ్రాఫర్లు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చొరవ చూపాలని కోరారు. కర్లపాలెం మండలం ఎట్రవారిపాలెం గ్రామానికి చెందిన ఫోటోగ్రాఫర్ ఎట్రా శివారెడ్డి అనారోగ్యంతో అంగవైకల్యానికి గురైనందున ప్రభుత్వ పరంగా పూర్తి సహాయం అందేలా కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు.అనంతరం అసోసియేషన్




సభ్యులు ఎట్రవారిపాలెం వెళ్లి శివారెడ్డిని పరామర్శించి ఆర్థిక సహాయం అందించారు. వయోభారం కారణంగా పనిచేయలేక ఇబ్బందులు పడుతున్న ఎస్కే నూర్‌భాషాకు బియ్యం, నిత్యావసర సరుకులు అందజేశారు. కార్యక్రమంలో కార్యదర్శి బి.ఎం. జయరావు, ఉపాధ్యక్షుడు మల్లేశ్వరరెడ్డి, కోశాధికారి సంగాని ఏడుకొండలు, సంయుక్త కార్యదర్శి వెంకటరావు, సీనియర్ ఫోటోగ్రాఫర్లు, అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.